

కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం..

బేగంపేట్, డిసెంబర్ 7: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వెంగళరావు నగర్ బస్తీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని గురువారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ప్రమాదం గురించి వివరాలను బాధితురాలు, అంగన్‌వాడి టీచర్ రమను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామాన్లు మొత్తం కాలిపోయాయని, తాము నిరాశ్రయులం అయ్యాయని చెప్పడంతో ఆయన రమను, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్వల్పంగా దెబ్బతిన్న పక్కనే ఉన్న ఇండ్లను కూడా సందర్శించి వారిని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు వ్యక్తిగతంగా అర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ, కిరణ్మయి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, కిశోర్, బస్తీవాసులు మల్లేశ్, ఝాన్సీ, ఆశారాణి, రాజు, నర్సింగ్‌రావు ఉన్నారు.

## జీతాలివ్వండి సార్..

- వేతనాల కోసం బల్దియా సిబ్బంది ఎదురుచూపులు
- ఖజానాలో నిధులు లేకపోవడంతో ప్రభుత్వంపై బల్దియా ఆశలు
- సిబ్బంది, ఉద్యోగుల్లో నెలకొన్న ఉత్కంఠ

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో జీతాల కోసం ఉద్యోగులు, సిబ్బందికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ నెల 1న రావాల్సిన వేతనాలు వారం రోజులు దాటినా చెల్లింపులు జరగలేదు. ఇందుకు కారణం బల్దియా ఖజానాలో నగదు లేకపోవడమే. ముఖ్యంగా గడిచిన మూడు నెలలుగా సిబ్బంది, అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో ఆస్తిపన్ను వసూళ్లలో ఆశించిన ఫలితాలు రాకపోవడం, నిర్మాణ రంగ అనుమతుల రుసుం లేకపోవడమే కారణం. దీంతో ఉద్యోగుల వేతనాల చెల్లింపులపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే చేసేది ఏమి లేక ఆర్థిక సహాయం కోసం జీహెచ్‌ఎంసీ నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. నూతన ప్రభుత్వం సహకరిస్తేనే జీహెచ్‌ఎంసీలో ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు అందే పరిస్థితి నెలకొంది. ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో నూటికి తొంభై శాతం మంది మధ్యతరగతికి చెందిన వారే కావడంతో సకాలంలో జీతం అందక నిర్ణీత సమయంలో ఇంటి అద్దెలు, ఈవీఎంలు, పిల్లల స్కూల్ ఫీజులు ఇప్పటికే చేసిన అప్పులకు మిత్తీలను చెల్లించకలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. కాగా, వేతనాల చెల్లింపులే కాకుండా జీహెచ్ ఎంసీలో పర్మినెంట్ ఉద్యోగులు, సుమారు మూడున్నర వేల మంది ఉండగా, ఔట్‌సోర్సింగ్ కార్మికులు దాదాపు 28వేల వరకు ఉన్నారు. వీరందరికీ జీతాలతో పాటు ఇప్పటికే రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పింఛన్ రూపంలో నెలకు రూ. 20కోట్లతో కలిపి నెలకు దాదాపు రూ. 135 కోట్లు, వీటితో పాటు నెలవారీ వడ్డీ కట్టేందుకు మరో రూ.100 కోట్లు అవసరమవుతాయి. ఇదే విషయాన్ని జీహెచ్‌ఎంసీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా...ప్రభుత్వం నిధులు ఏ మేర విడుదల చేస్తుందోనన్న ఉత్కంఠ ఉద్యోగులు, సిబ్బందిలో నెలకొన్నది.

## తుఫాన్ వల్ల పలు రైళ్లు రద్దు..



సిటీబ్యూరో:మిచౌంగ్ తుఫాన్ వల్ల ప్రభావిత ప్రాంతాల్లో పలు రైల్వే స్టేషన్ల మధ్య నడిచే దాదాపు 18 రైళ్లను రద్దు చేస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఈ రైళ్ల రద్దు కొనసాగుతుందన్నారు. తుఫాన్ వల్ల ప్రయాణికులకు అసౌర్యం కలుగకుండా ముందస్తుగానే రైళ్లు రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

### శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

శబరిమలకు వెళ్లే భక్తుల కోసం నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగుతాయన్నారు.

# ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తా..

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, డిసెంబర్ 7: నియోజక వర్గం ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరంలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అంగోతు రాజునాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. మహేశ్వరంలో ప్రసిద్ధి గాంచిన శివగంగ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించి మొదటి సారి నియోజకవర్గానికి రావడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సబితాఇంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నియోజక వర్గంలో చేసిన అభివృద్ధిని చూసి నియోజక వర్గ ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టారని ఆమె తెలిపారు. నియోజక వర్గంలో ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని పని చేస్తానని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఇక ముందు వచ్చేవి ఎన్నికల కాలమని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆమె సూచించారు. నియోజక వర్గంలో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతామని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధికి తనకు సహకరించిన అధికారులు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్, సహకార బ్యాంక్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహ బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, కూనయాదయ్య, మునగపాటి నవీన్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, నియోజక వర్గం ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు డా. వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులు తదితరులు

## 'విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలు పరిష్కరించాలి'

రవీంద్రభారతి, డిసెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ , గౌరవ అధ్యక్షుడు లాలూకోట వెంకటాచారి, మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కోరారు. గురువారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ వేములవాడ మదన్‌మోమన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో శ్రీకాంతాచారి మొదలు 42 మంది విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి యువకిశోరాలు ఆత్మబలిదానాలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ..తమ సమస్యలు పట్టించుకొని.. ఆదుకోవాలన్నారు. అంతరించిపోతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల వృత్తులకు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి.. యువతకు ఉపాధి కల్పించాలన్నారు. చొల్లేటి కృష్ణమాచారుల్య మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలను నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కరించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి, అద్దంకి నాగేశ్వరరావు, వీరోజు చంద్రమౌళి, శ్రీనివాస్ చారి, ఎ.వేణుగోపాల్, దేవరకొండా వీరాచారి తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ ఫుట్‌బాల్ టీమ్‌తో జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 7: వర్సిటీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడాపోటీల్లో రాణించాలని జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 15 వరకు జరిగే సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు వర్సిటీ ఫుట్‌బాల్ టీమ్‌ను ఎంపిక చేశారు. గురువారం వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డిని టీమ్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గతంలో క్రీడాకారులకు సరైన కోచ్‌లు, వసతులు లేకపోవడం వల్ల నైపుణ్యాలను పెంపొందించుకోవడం కష్టంగా ఉండేదన్నారు. నేడు వర్సిటీలో మెరుగైన శిక్షకులు, వసతులు అందుబాటులో ఉన్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొన్నప్పుడే క్రీడాకారుల సత్తా వెలుగులోకి వస్తుందని, సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనే ఆయా జట్లు రాణించి వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్.ఎస్. దిలీప్, కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్ పాల్గొన్నారు.



కరాటే పోటీలో బంగారు పతకం సాధించిన సంతోషిణిరెడ్డి

## ఎస్‌జీఎఫ్ జాతీయ కరాటే పోటీలకు ఎంపిక

కాచిగూడ, డిసెంబర్ 7: ఈ నెల 5, 6, 7 తేదీల్లో నల్గొండలో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో బర్కత్‌పుర జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన కరాటే విద్యార్థి సంతోషిణిరెడ్డి బంగారు పతకాన్ని సాధించారు. అదే విధంగా ఈ నెల 16 నుంచి 19 వరకు ఢిల్లీలో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గన సంతోషిణిరెడ్డికి చోటు లభించింది.

# సిటీ బస్సుల్లో ఐటిమ్స్‌తో టికెట్లు

### యూపీఐ పేమెంట్ ద్వారా టికెట్ జారీకి సన్నాహాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : నగరంలో సిటీ బస్సుల్లో టికెట్ జారీ కోసం నూతన పద్ధతులను అవలంబించే దిశగా ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టిమ్ యంత్రాల స్థానంలో ఐటిమ్స్ యంత్రాలను సరికొత్తగా టికెట్ జారీ కోసం ప్రవేశపెట్టబోతున్నారు. నగరంలో ఉన్న 2800 పైగా సిటీ బస్సులకు కావాల్సిన ఐటిమ్స్ టికెట్ జారీ మిషన్లను కొనుగోలు ప్రక్రియ జరుగుతున్నది. అందుకోసం ఏజెన్సీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒక్కొక్క ఐటిమ్స్ టికెట్ యంత్రం ఖరీదు దాదాపు రూ.15 వేలకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆమోదంతో ఐటిమ్స్ టికెట్ యంత్రాలను కొనుగోలు చేసే ప్రక్రియ ఉంటుందని, ప్రయత్నాలు మాత్రం కొనసాగుతున్నాయని ఆర్టీసీ గ్రేటర్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సిటీ బస్సుల్లో కీబోర్డుతో ఉన్న టిమ్స్ యంత్రాలతో టికెట్లు జారీ చేస్తున్నారు. దీనికంటే అత్యంత ఆధునికంగా ఐటిమ్స్ టికెట్ మిషన్ పని చేస్తుందన్నారు.

### త్వరలోనే జిల్లా బస్సుల్లో కూడా..

ఐటిమ్స్ టికెట్ జారీ యంత్రంలో అనేక ఆధునిక ఫ్యూచర్లు ఉన్నాయి. యూపీఐ విధానంలో టికెట్ జారీ కోసం పేమెంట్ చేయవచ్చు. పైగా ఇందులో టికెట్ల ఖాళీల సంఖ్య.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి జియో ట్యాగింగ్ కూడా ఉంటుంది. ఈ యంత్రాలు ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నడుస్తున్న పుష్పక్ బస్సుల్లో వినియోగిస్తున్నారని అధికారులు గుర్తు చేశారు. త్వరలోనే జిల్లా బస్సుల్లో కూడా ఈ యంత్రాలను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.